

# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట


## భూసేకరణ పనుల్లో వేగం పెంచాలి

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



భూసేకరణ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

**వనపర్తి క్రైమ్, మే 28 ప్రభాతవార్త :** ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పనుల్లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ పై ఇరిగేషన్ అధికారులు రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు.కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, పాలమూరు రంగారెడ్డికి సంబంధించి కేటగిరి 1 ప్రాధాన్యత కింద నిర్ధారించిన భూములను త్వరగా సేకరించి ఇరిగేషన్ శాఖకు అప్పగించాలని రెవెన్యూ, సర్వే అధికారులను సూచించారు. కేటగిరి 1 కింద జయన్న తిర్మలపూర్‌లో 12.95 ఎకరాలు, రేవల్లి మండలం కేశంపేట గ్రామానికి సంబంధించి 29.24 ఎకరాలకు త్వరగా సర్వే చేసి పెగ్ మార్క్ చేయాలని, సర్వేయర్లను పంపించి వారం రోజుల్లో సర్వే పూర్తిచేసి ఇవ్వాలని ఆదేశించారు.. అదేవిధంగా రేమద్దుల డీ8, కర్నేతాండ ఎత్తిపోతలకు సంబంధించిన భూసేకరణ పనులు వేగవంతం చేయాలన్నారు. షాపూర్‌లో 28.32 ఎకరాలు, మల్కాపూర్‌లో 8.35 ఎకరాలు, పొల్కేపాడులో భూసేకరణ యుద్ధప్రాతిపదికన పూర్తి అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఘనపసముద్రం, బుద్ధారంలో 96 ఎకరాలకు అవార్డ్ పాస్ అయినందున రైతులకు పేమెంట్ అయ్యేటట్లు చూడాలని భూసేకరణ అధికారిని ఆదేశించారు. ఘనపూర్ మండలం అల్లమాయపల్లి లో 10 ఎకరాలు, మిల్క్బ్రియాన్ పల్లిలో 6 ఎకరాలు, తిరుమలాయపల్లి లో 23 ఎకరాలు సైతం కేటగిరి1 లో ఉన్నందున జూన్ చివరి నాటికి సర్వే పూర్తి చేసి అవార్డ్ పాస్ చేసి ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తి కావాలని ఆదేశించారు. సర్వేయర్‌లు ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని భూసేకరణ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇకనుండి ప్రతివారం భూసేకరణ పురోగతిపై సమీక్ష ఉంటుందని, భూసేకరణ పూర్తి అయిన నివేదికలు ఇవ్వాల్సి ఉంటుందని ఆదేశించారు. భూసేకరణ ప్రత్యేక అధికారి ఆర్డిఓ డి.సుబ్రహ్మణ్యం ఇరిగేషన్ ఎస్.ఈ. జె.శ్రీనివాస్ రెడ్డి, ఇరిగేషన్ కార్యనిర్వాక ఇంజనీరు మధుసూదన్ రావు, ఎడి సర్వే బాలకృష్ణ ఇరిగేషన్ ఈ.ఈ కేశవరావు, సెక్షన్ సూపరింటెండెంట్ మదన్ మోహన్ తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పథకాలపై అధికారులతో సమీక్ష

- లబ్ధిదారులకు జూన్ 2న మంజూరు పత్రాల పంపిణీ
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,మే28 ప్రభాతవార్త:** రాజీవ్ యువవికాసం స్కీమ్ ద్వారా దశలవారీగా లబ్ధి చేకూరేలా ప్రణాళిక రూపొందించి, జూన్ 2న లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో బీసీ,ఎస్సి,మైనారిటీ,ట్రైబల్ కార్పొరేషన్, ఎంపీడీవోలు,మున్సిపల్ కమిషనర్లు,సంబంధిత శాఖల అధికారులతో రాజీవ్ యువవికాసం,ఇందిరమ్మ ఇండ్లు,పథకాల లబ్ధిదారుల వివరాలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం యూనిట్ల గ్రౌండింగ్ ఏర్పాట్లను సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. స్వయం ఉపాధి యూనిట్ల ప్రారంత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. యూనిట్లన్నీ గ్రౌండింగ్ అయ్యేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుంటూ, స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో లబ్ధిదారుల యూనిట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాపై మండలాల వారిగా కలెక్టర్ సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని,అధికారులు ప్రణాళికబద్ధంగా పనిచేసే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు లబ్ధిదారులు మండలంలో ఏర్పాటుచేసిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను సందర్శించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ సంతోష్

**గద్వాల,మే 28,ప్రభాతవార్త:** సేకరించిన వరి ధాన్యానికి వెంటనే చెల్లింపులు జరగేలా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లాకలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం గద్వాల మండల కేంద్రంలోని గుర్రం గడ్డ ద్వీప గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి, మిగిలి ఉన్న ధాన్యం 17 శాతం తేమ రాగానే కాంటా వేసి మద్దతు ధరకు కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం కాంటా వేసిన బస్తాలను మిల్లులకు ఎప్పటికప్పుడు వేగవంతంగా మిల్లులకు తరలించాలని సూచించారు. వరి ధాన్యానికి త్వరితంగా చెల్లింపుల కోసం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ తక్షణం పూర్తి చేయాలన్నారు.జిల్లాలో వరి ధాన్యం సేకరణ గతంతో పోల్చితే ఈ సంవత్సరం అధికంగా సేకరించడం జరిగిందని,ఇప్పటివరకు 90వేల మెట్రిక్ టన్నుల ధాన్యం -మిగతా4లో..

## రైతులకు ఇబ్బందులు కలగొద్దు

**నవాబుపేటలో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ విజయేంద్రబోయి**

**నవాబుపేట, మే 28 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని గురుకుంట,కొల్లూరులో ఐకెపి వరి కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు, సెంటర్ కమిటీ మెంబర్లతో మాట్లాడుతూ వర్షం ప్రభావం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కొనుగోలు దారులకు సూచించారు. రైస్ మిల్లు దగ్గర ఇబ్బందులు ఎదురైతే కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని కమిటీ మెంబర్లకు తెలియజేశారు. కార్యక్రమంలో నవాబుపేట మండల అధికారులతో పాటు తహసిల్దార్, ఐకెపి అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో వివరాలు ఆరా తీస్తున్న కలెక్టర్

# ఐఐఐటి @ పాలమూరు



- ఫలించిన ఎమ్మెల్యే యెన్నం కృషి
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ
- ఐఐఐటీ మంజూరు చేస్తూ జీవో జారీ
- 50ఎకరాల స్థలం కేటాయింపు
- మహబూబ్‌నగర్ - జడ్చర్ల మధ్య ఏర్పాటు
- 3కోర్సులతో తరగతులు ప్రారంభం

### ఏడు దశాబ్దాల కల..నెరవేరిన వేళ

**పాలమూరు చరిత్రలో మరో చారిత్రక ఘట్టానికి నాంది పడింది. ఏడు దశాబ్దాల నాటి కల నెరవేరింది. విద్యా కిరీటంలో మరో కలికితురాయి చేరనున్నది. ఇప్పటికే పాలమూరుకు లా, ఇంజనీరింగ్ కళాశాలలు, ఏటీసీ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ మంజూరు కాగా, తాజాగా ట్రిపుల్ ఐటీ కళాశాల మంజూరు చేస్తూ జీవో కూడ జారీ కావడం ఉమ్మడి జిల్లా విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 3కోర్సులతో ఐఐఐటీ 2025-26 విద్యాసంవత్సరం ప్రారంభంకానున్నది. ఇప్పటికీ రాష్ట్రంలో హైదరాబాద్, బాసరలో మాత్రమే ట్రిపుల్ ఐటీలు ఉండగా ఇప్పుడు పాలమూరులోనూ ఐఐఐటి ఏర్పడనున్నది.**

- మహబూబ్‌నగర్ బ్యూరో, మే28, ప్రభాతవార్త



**ఉమ్మడి జిల్లాకు వరం..**

స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత దక్షిణ తెలంగాణ ప్రాంతంలో ఒక ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉండేది. కానీ జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కాలేజీల ఏర్పాటుకు గత ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. ఈ క్రమంలోనే వనపర్తిలో ఒక జేఎన్‌టీయూ కళాశాలను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంజనీరింగ్ కాలేజీల సంఖ్య ఉమ్మడి పాలమూరు జిల్లాలో తక్కువగా ఉండటం, పాలమూరు యూనివర్సిటీకి ప్రత్యేకంగా ఇంజనీరింగ్ కాలేజీ లేకపోవడంతో ప్రభుత్వం పీయూకు అనుబంధంగా ఇంజనీరింగ్ కాలేజీని మంజూరు చేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు కూడా ప్రారంభం కానున్నాయి. దీంతోపాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రభుత్వ న్యాయ కళాశాల లేకపోవడంతో దాన్ని కూడా పీయూకు అనుబంధంగా ఏర్పాటు చేసి, ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభించనున్నారు. పాలమూరుకు ట్రిపుల్ ఐటీ మంజూరు కావడం ఈ యేడాది నుంచే మూడు కోర్సులతో ప్రవేశాలు సైతం ఆహ్వానించనుండడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**హామీలు నెరవేరుస్తున్నాం..**

మహబూబ్ నగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్ గా మారుస్తాం. ఎన్నికల సందర్భంగా ఇల్లు ఇల్లు తిరిగి హామీ ఇచ్చాం. మా మాటలు నమ్మి ప్రజలు ఓటు వేశారు. ఇప్పుడు ఒక్కొక్కటిగా హామీలను అమలు చేస్తున్నాం. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, హైవేస్, రింగ్ రోడ్డు, కొడంగల్ ఎత్తిపోతల పథకం మరే ఇతర అభివృద్ధి పనుల విషయంలో అయినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో సాధిస్తున్నాం. రాష్ట్ర చరిత్రలో ఇంత శీఘ్ర గతిన ఏ ప్రాజెక్టు రాలేదు. ముఖ్యమంత్రి చొరవతో ఐఐఐటి కళాశాల మన ఉమ్మడి జిల్లాకు రావడం సంతోషంగా ఉంది. స్థల విషయంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కూడా సహకరించారు. జిల్లా ప్రజలందరి తరపున ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

**- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

4



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

## ఇది సుదినం..

- ఏడు దశాబ్దాల కల..నెరవేరిన వేళ
- ఉమ్మడి జిల్లా విద్యార్థులకు ఎంతో మేలు
- సీఎం రేవంత్‌రెడ్డి చొరవతోనే ఐఐఐటీ సాకారం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 28, ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ఈ రోజు గొప్ప సుదినం అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ జిల్లాకు ఐఐఐటి మంజూరు చేస్తూ ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నారాయణ పేట ఎమ్మెల్యే డాక్టర్ పర్ణికా రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో ఉన్న ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయం కావాలని మన ఉమ్మడి జిల్లా తల్లిదండ్రులు ఆశించేవారని, ఉన్నత విద్య కోసం వివిధ ప్రాంతాలకు తమ పిల్లలను పంపించేవారని ఆయన చెప్పారు. ఈ 75 సంవత్సరాల కాలంలో ఎందరో అధికారంలో ఉన్నారు. కానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన మహబూబ్ నగర్ కు ఎంతో ప్రతిష్టాత్మకమైన ఐఐఐటి కళాశాల రావడం జరిగిందన్నారు. ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ 5000 కోట్లతో నారాయణ పేట ఎత్తిపోతల పథకానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు అని ఆయన చెప్పారు. విద్యాపరంగా ఈరోజు బాసర ఐఐఐటిలో 9వేల మంది విద్యార్థులు అక్కడ చదువుతున్నారని, ఇప్పుడు మన మహబూబ్ నగర్‌కు ఐఐఐటి కళాశాల మంజూరు కావడంతో ఉమ్మడి జిల్లాలోని 14నియోజకవర్గాలకు చెందిన మెరిట్ విద్యార్థులకు మేలు జరుగుతుందని ఆయన చెప్పారు. జడ్చర్ల మహబూబ్ నగర్ నియోజకవర్గాల మధ్య ఐఐఐటి కళాశాల నిర్మాణం చేస్తున్నామని, ఉమ్మడి జిల్లా 14నియోజకవర్గాలకు -మిగతా4లో..

## కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలి

### నారాయణపేట జిల్లా అధికారులకు ఎంపీ డీకే అరుణ దిశా నిర్దేశం

**నారాయణపేట,మే 28 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని, అర్హులందరికీ ఆయా పథకాలను లబ్ధి చేకూర్చాలని పాలమూరు ఎంపీ, దిశ కమిటీ చైర్ పర్సన్ డీ.కే. అరుణ అన్నారు. బుధవారం నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన జిల్లా అభివృద్ధి,సమన్వయ మరియు పర్య వేక్షణ కమిటీ (దిశ) రెండవ సమావేశానికి పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ అధ్యక్షత వహించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాల గురించి సమావేశంలో సమీక్షించారు. మొత్తం 46 ప్రభుత్వ శాఖల పరిధిలో కేంద్ర,రాష్ట్ర నిధులతో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఎంపీ డీకే అరుణ జిల్లా అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలు అవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా, పారదర్శకంగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవా లని ఆమె సూచించారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో లోటు పాట్లు ఉంటే సరి చేసుకుని పూర్తి స్థాయిలో అమలు జరిగి ప్రజలకు ఉపయోగపడేలా సమీక్షించి పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. కాగా సమావేశంలో మొదటగా జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి 2020,21 నుంచి 2024,2025 వరకు కేంద్రం నుంచి జిల్లాకు మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులు, ఎస్ఎఫ్‌సీ నిధుల



మాట్లాడుతున్న ఎంపి డికె అరుణ

వివరాలను వెల్లడించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. జయ చంద్రమోహన్ వైద్య శాఖ నివేదికలో భాగంగా జిల్లాకు విధించిన ఏఎన్‌సీ, ఇమ్యూనైజేషన్, ఫ్యామిలీ ప్లానింగ్ స్టేరిలైజేషన్, ప్రసవాల టార్గెట్లు, అచీవ్ మెంట్ల గురించి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ డీ కే అరుణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యం పట్ల ఎంతో శ్రద్ధ చూపుతోందని, మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ చేయడం లేదా అని ప్రశ్నించారు. ఆశా, ఏఎన్ఎంలు, మహిళా సంఘాల సభ్యులు మహిళలకు అవగాహన కల్పించి స్క్రీనింగ్ చేసుకునేలా చూడాలన్నారు. ముందస్తుగా ఏదైనా రుగ్మత తెలిస్తే నివారించవచ్చన్నారు. ప్రభుత్వాలు ఏం పథకాలు అమలు చేస్తున్నాయో క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరేలా తెలియజేయాలన్నారు. మనం ఏం చేస్తున్నాం! ఎంత వరకు చేశాం..!! ఎంత సక్సెస్ అయ్యామో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎస్సీ వెల్ఫేర్, మిషన్ భగీరథ, జిల్లా పౌర



హాజరైన అధికారులు

సరఫరాల శాఖ, జీఎండిఐసి, నాబార్డు, పశుసంవర్ధక శాఖ, భూగర్భ జలవనరుల శాఖ, జిల్లా మార్కెటింగ్ శాఖ, చీఫ్ ప్లానింగ్, హార్టికల్చర్, నీటిపారుదల శాఖ, నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, డిస్టిక్ సర్వే ల్యాండ్, పోస్టల్, జిల్లా పరిషత్, అడిట్ ఎడ్యుకేషన్, ఎల్‌డిఎం, డీఎఫ్ఓ, డివైఎస్ఓ, చేనేత జౌళి శాఖ, పబ్లిక్ హెల్త్, మున్సిపల్, మెప్మా, మత్స్యశాఖ, గ్రిడ్, ట్రైబల్ వెల్ఫేర్, వైద్య విధాన పరిషత్, జిల్లా ఆస్పత్రి ప్రిన్సిపల్ మెడికల్ కాలేజ్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్‌ల నివేదికపై ఎంపీ డీకే అరుణ సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికా రెడ్డి, డీఎఫ్‌వో అరవింద్, ఆర్డీఓ రామచంద్రనాయక్, జెడ్పీ సీఈవో శైలేష్ కుమార్, దిశ కమిటీ సభ్యులు లక్ష్మి శ్యాంసుందర్ గౌడ్, పాండు నాయక్, కిరణ్, పడాకుల శ్రీనివాసులు, బలరాం రెడ్డి, అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి

- తెలంగాణ ఖ్యాతిని చాటిన మహనీయుడు : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- తెలంగాణ పోరాటంలో సురవరం స్ఫూర్తి : ఎంపీ డీకే అరుణ
- పాలమూరు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సురవరం ప్రతాపరెడ్డి జయంతి



సురవరం ప్రతాపరెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 28 ప్రభాతవార్త:** తెలుగు భాషా వికాసానికి అవిరళ కృషి సల్పిన మహానుభావుడు సురవరం ప్రతాపరెడ్డి అని ముఖ్యఅతిథులుగా విచ్చేసిన పార్లమెంట్ సభ్యులు డి.కె.అరుణ, శాసన సభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం పాలమూరు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సురవరం ప్రతాపరెడ్డి జయంతోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికా సంపాదకుడిగా, పరిశోధకుడిగా పండితుడిగా రచయితగా క్రియాశీల ఉద్యమకారుడిగా -మిగతా4లో..

## ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలి

- వివరాలు పకడ్బందీగా ఆరా తీయాలి
- ప్రతి వార్డు పరిశుభ్రంగా ఉండాలి
- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 28 ప్రభాతవార్త:** వర్షాకాలంలో పట్టణం పరిశుభ్రతగా ఉంచేలా వార్డు అధికారులు పారిశుధ్య నిర్వహణ సమర్థంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి అన్నారు.బుధవారం మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ వార్డు అధికారులకు ఏర్పాటుచేసిన దిశానిర్దేశం కార్యక్రమ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ వార్డు అధికారులు ప్రభుత్వ పథకాల అమలులో వారి వార్డులలో వారిదే కీలక పాత్ర అని ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం, రేషన్ కార్డులు వంటివి వార్డులలో వార్డు అధికారులే పరిశీలించాలని. ప్రతి రోజు ఉదయమే మీ వార్డుకు చేరుకుని చెత్త సేకరించడానికి సిబ్బంది వస్తున్నారో లేదో గుర్తించాలని, తడి, పొడి చెత్త వేరుగా సేకరిస్తున్నారా, ప్రజలు చెత్తను వేరు చేసి ఇస్తున్నారా లేదా పది ఇండ్ల లోని వారికి అడిగి తెలుసుకుని వారి వివరాలు రాసుకోవాలని. చెత్త సేకరించే వారు రానట్లయితే పై అధికారులకు తెలియజేయాలని అన్నారు. ఖాళీ స్థలంలో చెత్త ఉంటే ఆ స్థలం వారి వివరాలు పక్కా ఇంటి వారి ద్వారా తెలుసుకుని ఆ స్థలాన్ని శుభ్రం చేసుకుని, బౌండరీలు నిర్మించుకోవాలని లేదా పెనాల్టీ కట్టాల్సి వస్తుందని వారికి తెలియజేయాలని కాలువలను ఎప్పుడూ శుభ్రం చేస్తున్నది, ఎంత మంది కాలువలు శుభ్రం చేయడానికి వస్తున్నారు వంటివి పరిశీలించాలని, ఎవరైనా సిబ్బంది రాకుంటే జవాన్‌కు తెలియజేయాలని లేదా పై అధికారులకు సమాచారం అందించాలన్నారు.వార్డులలో త్రాగునీరు ఎన్ని రోజులకు, ఎప్పుడెప్పుడు వస్తుందో లైన్‌మెన్ ద్వారా తెలుసుకోవాలని, ఒక పది ఇండ్లలోని వారిని త్రాగునీరు గురించి అడిగి తెలుసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఇప్పుడు వచ్చే వర్షాకాలంలో కాలువలో మురికి అలాగే ఉండకుండా తీసేలా చర్యలు తీసుకోవాలని, వార్డులలో దోమలు నివారించేందుకు ఫాగింగ్ మిషన్ లను సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. రోడ్లపై, కాలువలలో చాలా చోట్ల చెత్త, ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలతో నిండి ఉంటున్నాయని, వాటిని శుభ్రం చేసేలా వార్డు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, నాళాల్లో చెత్త చేరకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కూలడానికి ఉన్న పాత ఇండ్లు, పాఠశాలలను గుర్తించి వారిని కమ్యూనిటీ సెంటర్లలో ఉంచాలని. వీధిలైట్లు పని చేస్తున్నాయో లేదో పరిశీలించి సంబంధిత అధికారులకు వార్డు అధికారులు తెలియజేయాలని అన్నారు. మున్సిపల్ పర్మిషన్ లేకుండా ఎవరైనా నిర్మాణాలు చేస్తున్నట్లయితే వారి వివరాలను అధికారుల దృష్టికి తీసుకు రావాలని అన్నారు వార్డులలో ఎవరైనా కొత్తగా ఇల్లు కట్టుకుంటున్నట్లయితే వారికి ముందు వైపు కొంత భాగం వదిలి కట్టుకోవాలని తెలుపాలని. అగ్ని ప్రమాదాలు వంటివి జరిగినప్పుడు ఇంటి చుట్టూ తిరిగేలా, అంబులెన్సు సిబ్బంది మనుషులను అంబులెన్స్ లో తరలించేందుకు ఇబ్బంది లేకుండా ఉంటుందని ఆ విధంగా నిర్మాణాలు చేపట్టాలని అవగాహన కలిగించాలని కలెక్టర్ వార్డు అధికారులకు సూచించారు. ప్రాపర్టీ ట్యాక్స్, వాటర్ ట్యాక్స్ వంటివి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు వార్డులలో మున్సిపల్ పార్కులు వుంటే వాటిని అప్పుడప్పుడు తనిఖీ చేయాలని, పార్క్ పచ్చగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పార్కును ఎవరు ఆక్రమించిన వార్డు అధికారులు పై అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. వార్డు లలో ఎంత మందికి త్రాగునీరు నల్ల కనెక్షన్ లేదో తెలుసుకోవాలని. ప్రతి వార్డు అధికారులకు వారి వార్డులో ఒక ఆఫీస్ వార్డు అధికారి కార్యాలయం వార్డు నంబర్ ఉండే బోర్డును ఏర్పాటు చేసి అందులో ఒక టేబుల్, కుర్చీలు, రిజిస్టర్లు, ఇతర సామాన్లు పెట్టుకొనుటకు బీరువా ఏర్పాటు చేయాలని కమిషనర్లకు తెలిపారు. మున్సిపల్ శాఖ ద్వారా వచ్చిన వంద రోజుల యాక్షన్ ప్లాన్ ను అందరూ అధికారులు వంద శాతం అమలు చేయాలని కలెక్టర్ అన్నారు. ఫ్రైడే డ్రై డే వంటి కార్యక్రమాలను నిర్వహించాలని. వార్డు అధికారి వారి వార్డుకు వెళితే వార్డులోని ప్రజలు వార్డు అధికారి అని గుర్తుపట్టాలని ఆ విధంగా ప్రతి రోజు పనిచేయాలని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మహబూబ్ నగర పాలక సంస్థ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జడ్చర్ల, మున్సిపల్ కమిషనర్ భూత్పూర్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు, వార్డు అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

# ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ త్వరగా పూర్తి చేయాలి

**పెబ్బేరు, వనపర్తి రోడ్డు పనులు సమీక్షించిన కలెక్టర్**

**కరెంటు, డ్రైనేజీ పనులు త్వరగా ముగించండి : జిల్లా కలెక్టర్**



అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

**పెబ్బేరు,మే28 ప్రభాతవార్త :** పెబ్బేరు తహసిల్దార్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తత, పెబ్బేరు వనపర్తి రోడ్డు విస్తరణపై సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు మొదటి విడతలో మంజూరు అయిన వాటిని త్వరగా గ్రౌండింగ్ అయ్యే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని మండల అభివృద్ధి అధికారిని ఆదేశించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల రెండవ విడత జాబితా పారదర్శకంగా ఉండేవిధంగా చూసు కోవాలని సూచించారు. పెబ్బేరు వనపర్తి రోడ్డు విస్తరణపై చర్చిస్తూ రోడ్డు విస్తరణలో తొలగించాల్సిన ఇంటి నిర్మాణ యజమానులకు నోటీస్‌లు జారీ చేసే నిర్మాణాలు తొలగించాలని, రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

# బడుగు బలహీన వర్గాల నేత స్వర్గీయ నందమూరి తారక రామారావు



అమరచింతలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**అమరచింత, మే 28, ప్రభాతవార్త:** బడుగు బలహీనవర్గాల నేత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు అని తెలుగుదేశం పార్టీ అమరచింత మండల అధ్యక్షులు, మోదీ మనోహరాజ్ అన్నారు. బుధవారం అమరచింత మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బస్టాండులో స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 102 జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసిన తొమ్మిది నెలలకే అధికారం చేపట్టి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే పేదలకు రెండు రూపాయలకే కిలో బియ్యం తో పాటు మద్యపానం నిషేధం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావుకి దక్కిందని ఆయన అన్నారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు స్ఫూర్తితో టిడిపి కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే దుకాణాల లైసెన్సులను రద్దు చేస్తాం



తనిఖీ నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు పోలీసులు

**అమరచింత, మే 28, ప్రభాతవార్త:** ఖరీఫ్ సీజన్లో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే దుకాణాల లైసెన్సులను రద్దు చేస్తామని మండల వ్యవసాయ అధికారి, అరవిందు ఫర్టిలైజర్ షాప్ యజమానులను హెచ్చరించారు. బుధవారం అమరచింత మండల కేంద్రంలోని స్థానిక ఎస్సై, సురేష్ తో కలిసి ఫర్టిలైజర్ షాపులను తనిఖీ నిర్వహించారు. ఫర్టిలైజర్ షాపులలో రిజిస్టర్ స్టాక్‌ను,బిల్లు బుక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు షాప్ యజమానులతో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని వారు రైతులకు సూచించారు. అలాగే గ్రామాలలో గుర్తుతెలియని వ్యక్తులు నకిలీ విత్తనాలు విక్రయించడానికి వస్తే ఆయా గ్రామాల రైతులు వ్యవసాయ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారు కోరారు. ఫర్టిలైజర్ షాపులలో నకిలీ విత్తనాల అమ్మితే కేసులు నమోదు చేస్తామని వారు ఫర్టిలైజర్ షాప్ యజమానులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అమరచింతలో జూనియర్ కాలేజీ హామీ ఏమైంది?

**ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి, ఎండి కుతుబ్**




సమావేశంలో మాట్లాడుతున్న ఎండి కుతుబ్

**అమరచింత,మే28, ప్రభాతవార్త;** అమరచింత మండల కేంద్రంలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేస్తానని మక్తల్ ఎమ్మెల్యే, వాకిటి శ్రీహరి హామీ ఇచ్చిన అకాడమిక్ విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న అమరచింతలో జూనియర్ కాలేజీ హామీ ఏమైందని వనపర్తి జిల్లా ఏఐవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, ఎండి కుతుబ్ ప్రశ్నించారు. బుధవారం అమరచింత మండల కేంద్రంలో మాట్లాడుతూ, అమరచింత మండలంతో పాటు మున్సిపాలిటీ ఏర్పడిన పదవ తరగతి పూర్తయిన విద్యార్థులు జూనియర్ కాలేజ్ అడ్మిషన్ల కోసం ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్యే ఇప్పటికైనా స్పందించి ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. గత పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో విద్య పూర్తిగా భ్రష్టు పట్టిందని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల దృష్టి సారించాలని ఆయన కోరారు. అమరచింతలో ఈ విద్యా సంవత్సరం జూనియర్ కాలేజ్ అడ్మిషన్లు ప్రారంభించకుంటే విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో తీవ్ర ఆందోళనకు దిగుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాల్, చేతన్, మైబు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీర్చిన మహోన్నతుడు ఎన్టీఆర్



పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

**ఆత్మకూర్ మే 28, ప్రభాతవార్త;** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం పార్టీని స్థాపించి అడదికాలంలోనే అధికారం చేపట్టి పేదల ఆకలి తీర్చిన మహోన్నతుడు ఎన్టీఆర్ అంటూ పలువురు తెలుగుదేశం నాయకులు కొనియాడారు. నందమూరి తారకరామారావు 102 వ జయంతి వేడుకలను మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆత్మకూర్ పట్టణ మాజీ సర్పంచ్ కరితమండి రాములు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో పార్టీని స్థాపించి రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిన ఘనత భారతదేశ చరిత్రలో నందమూరి తారక రామారావుకి దక్కుతుందని ఆయన కొనియాడారు ఎన్టీఆర్ ఆశయ స్ఫూర్తితో తెలుగుదేశం పార్టీ ఇప్పటికీ మనగడ కొనసాగించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ,అభిమాన సంఘంనాయకులు తెలుగుదేశం పార్టీనాయకులు తిరుపతయ్య గౌడ్, ఎస్.టి.డి శ్రీనివాసులు, కట్టెలమండి రాజు, పిన్నంచర్ల జగన్, కోట్ల వెంకటేష్, తదితరులతో పాటుగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**వీపనగండ్ల ,మే 28, ప్రభాతవార్త;** వర్షాకాలం వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల వైద్యఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్య నోడల్ అధికారి డాక్టర్ వంశీకృష్ణ వైద్య అధికారులకు సూచించారు. బుధవారం కల్వరల సబ్ సెంటర్ పిహెచ్‌సి వీపనగండ్ల ఆరోగ్య కేంద్రాలను సందర్శించి టీకాల పట్ల వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తూ ఆసుపత్రి ప్రసవాలు మరియు గర్భవతుల రిజిస్ట్రేషన్ మెరుగుపరచాలని ఆయన సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రతి వారం డ్రైవ్ డే తప్పక పాటించాలని ఆయన సూచించారు. కీటక జనిత వ్యాధులను అరికట్టే విధంగా గ్రామాలలో పారిశుద్ధం తదితర వాటిపై గ్రామపంచాయతీలను అప్రమత్తంగా చేయాలని ఆయన సూచించారు. గ్రామాలలో డెంగ్యూ మరియు చికెన్ గున్యా ఫైలేరియా మెదడు వ్యాపు తదితర వ్యాధుల పట్ల వైది సిబ్బంది అప్రమత్తంగా ఉండి రోగులకు తగు సూచనలు సలహాలు ఇవ్వాలని ఆయన సూచించారు.

# ధాన్యం తరలింపుకు అధికారులు కీలకంగా వ్యవహరించాలి

**- ధాన్యం తరలింపుకు లారీలను అధిక మొత్తంలో వినియోగించాలి, - నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 28 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో చివరి దశలో ఉన్న వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులు కొనుగోలు నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో రెవిన్యూ, పౌరసరఫరాల, రవాణా శాఖల అధికారులు, మిల్లర్లు, లారీ అసోసియేషన్ సభ్యులు, అదనపు కలెక్టర్ పి.అమరేందర్‌తో కలిసి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం ఎక్కడా కూడా తడవకుండా కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు, గోదాములకు తరలించేందుకు రవాణాకు అవసరమైన లారీలను అధిక మొత్తంలో వినియోగించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి తరలింపు విషయంలో అధికారులు ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతులకు టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అకాల వర్షాల కారణంగా ధాన్యాన్ని తడిసిపోకుండా కాపాడటం ముఖ్యమని, కొనుగోలు చేసిన వెంటనే లారీలకు ఎక్కించి తక్షణమే గోదాములకు తరలించాలని స్పష్టం చేశారు. యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ప్రతి గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన లేకుండా ఉండేలా అధికారులు సమన్వయంతో అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం తడిసిపోకుండా కొనుగోలు కేంద్రాలనుండి మిల్లులు, గోదాముల వరకు రవాణా చేయడంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసం అవసరమైన లారీలు, హమాలీలు అధిక సంఖ్యలో వినియోగించాలని చెప్పారు. రెవిన్యూ, పౌరసరఫరాల, రవాణా శాఖల అధికారులు, మిల్లర్లు, లారీల అసోసియేషన్ యజమానులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

# భూ భారతి రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలి



భూ భారతి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

**వనపర్తి క్రైమ్, మే 28 ప్రభాతవార్త :** జూన్ 3 నుంచి ప్రారంభం కానున్న రెండవ విడత భూ భారతి రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం ఐడిఓసి సమావేశ మందిరంలో భూ భారతి రెవెన్యూ సదస్సుల పై తహశీల్దార్లు, డిటిలు, ఆర్‌ఐలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ జూన్ 3 నుండి 20 వరకు రెండవ విడత భూ భారతి రెవెన్యూ సదస్సులు అన్ని గ్రామ పంచాయతీలలో నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. రెవెన్యూ సదస్సులో చేయాల్సిన పనులపై కలెక్టర్ వివరించారు. జూన్ 3 నుంచి జరిగే రెవెన్యూ సదస్సుకు మండలం నుండి రెండు బృందాలు ఏర్పాటు చేసుకొని రోజుకో గ్రామం గాని రెండు రోజులు ఒక గ్రామాన్ని సందర్శించి ఉదయం నుండి సాయంత్రం వరకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. భూ భారతి పై ప్రజలకు అవగాహన కల్పించి వచ్చిన దరఖాస్తులను సాధ్యమైనంత వరకు అక్కడే పరిష్కరించాలని సూచించారు. సదస్సుకు ఖాస్ర, చేసాల, ఆర్ఓఆర్ , ఇతర భూ రికార్డులు వెంట తీసుకువెళ్లాలని సూచించారు. పార్ట్ బి కేసులు, ఆర్ఎస్ఆర్ కేసులు తప్పకుండా పరిశీలించాలని సూచించారు. సక్సెషన్, పెండింగ్ మ్యుటేషన్ వంటి కేసులు సాధ్యమైతే అక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ భారతి రెవెన్యూ సదస్సులో ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారం కావాలని సూచించారు. భూ భారతి చట్టం అమలుపైన కానీ షెడ్యూల్ విషయంలో ఏమైనా అనుమానాలు ఉంటే అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్లు, డిటిలు, ఆర్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు మెరుగైన విత్తనాలు అందించాలి : కలెక్టర్




అధికారుల సమావేశంలో మాట్లాడు తున్న జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల,మే 28, ప్రభాతవార్త:** రైతులకు మెరుగైన విత్తనాలు అందించేందుకు అధికారులు, సీడ్ ఆర్గనైజర్లు,సీడ్ కంపెనీలు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. బుధవారం ఐడీఓసీ సమావేశ హాల్‌లో పత్తి విత్తన ఉత్పత్తిపై వ్యవసాయ శాఖ అధికారులు, సీడ్ కంపెనీలు,సీడ్ ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం వర్షాలు అనుకూలంగా ఉన్నాయి కాబట్టి పంట నష్టం లేకుండా, రైతులకు మంచి ఆదాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.జిల్లాలో పత్తి విత్తనాలే ప్రధాన ఆదాయ మార్గం కావడంతో,సుమారు 30,000 ఎకరాల్లో సాగు కొనసాగుతూ 35,000 నుండి 40,000 మంది రైతులు విత్తన ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. అధికారులు,సీడ్ ఆర్గనైజర్లు,సీడ్ కంపెనీలు పరస్పరం సమన్వయంతో పనిచేసి, రైతులకు మంచి దిగుబడి కలగడానికీ,అందరికి లాభం చేకూరడానికీ కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ ఏడాది విత్తన ఉత్పత్తి సంబంధించి కంపెనీలు తమ కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని సూచించారు.గత సంవత్సరానికి చెందిన మొత్తం విత్తన ఉత్పత్తి వివరాలతో పాటు,ఎంతమంది రైతుల విత్తనాలు బీవీగి పరీక్షలో ఉత్తీర్ణమయ్యిందో,ఎంత పరిమాణం విఫలమైందో వివరించిన జాబితాను సమర్పించాలని స్పష్టంగా ఆదేశించారు.సీడ్ ఉత్పత్తి చేస్తున్న రైతులకు సీడ్ కంపెనీలు సాంకేతిక సహాయం అందించాలన్నారు. ఎండ, భారీ వర్షాలు,తెగుళ్లు, వ్యాధులు వంటి కష్టకాల పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలో కంపెనీలు క్రమం తప్పకుండా రైతులకు నిపుణుల సహకారంతో శిక్షణ ఇవ్వాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.పత్తి విత్తనాల సాగులో బాల కార్మికులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబడదని,అలాంటి ఘటనలు ఎదురైతే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జగ్గు నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్,ఏ డి ఎ సంగీతలక్ష్మి, టెక్నికల్ ఏడీఏ రమేష్,మండల వ్యవసాయ శాఖ అధికారులు,సీడ్ కంపెనీల ప్రతినిధులు,సీడ్ ఆర్గనైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి: సిఐటియు




ఎన్నికైన నూతన కార్యవర్గం

**గద్వాల, మే 28,ప్రభాతవార్త:** ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్లో ఉన్న 7 నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఏ వెంకటస్వామి, వివి నరసింహ డిమాండ్ చేశారు.బుధవారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో వసతి గృహ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాలలో పనిచేస్తున్న కార్మికులకు గత ఏడు నెలలుగా వేతనాలు చెల్లించకపోతే కార్మికులు వాళ్ళ కుటుంబాలను ఏ విధంగా పోషించుకుంటారని ప్రశ్నించారు. చేసిన కష్టానికి కూడా వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. కార్మికుల సామాజిక భద్రతకు ఉపయోగపడే పీఎఫ్,ఈఎస్ఐ కార్మికుల ఖాతాలో సక్రమంగా జమ చేయడంలేదని జిల్లాసంక్షేమశాఖ అధికారులు ఏజెన్సీలతో మాట్లాడి పేస్లిప్పులు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వసతి గృహ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి హెల్త్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వసతి గృహ కార్మికుల నూతనకమిటీని ఎన్నుకున్నారు.జిల్లాఅధ్యక్ష,కార్యదర్శులుగా రంజిత్ కుమార్ ఆనందరాజు,ఉపాధ్యక్షురాలుగా శశికళ, శ్రీనివాస్, సహయ కార్యదర్శులుగా ప్రవళిక, కోశాధికారిగా జయాకర్, కమిటీ సభ్యులుగా లక్ష్మీ, హైమావతి, గోపాల్,ఎస్ గోపాల్, దావీదు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన, అధ్యక్ష కార్యదర్శులు రంజిత్ కుమార్,ఆనంద్ రాజు మాట్లాడుతూ ఇప్పటికే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కార్మికులను నియమించకపోవడం వల్ల అదనపు పని భారాలను మోస్తూ అనారోగ్యాల పాలవుతున్నమని ఆవేదన వ్యక్తం చేశారు.

పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని జులై మూడున కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమానికి పిలుపునిచ్చామని, ఈ కార్యక్రమానికి జిల్లాలో ఉన్న వసతి గృహ కార్మికులు అందరూ అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమం జయప్రదం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ,కార్మికులు ధావిద్,జయమ్మ నరసింహులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల దిక్సూచి సురవరం..!

- కలం వీరుడు సురవరం..!
- నిజాం నిరంకుశత్వాన్ని ప్రశ్నించిన ధైర్యశాలి
- సురవరంకు నివాళులర్పించిన టియుడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు



నివాళులర్పిస్తున్న టీయూడబ్ల్యూజే ఐజేయు నాయకులు

**వనపర్తి క్రైమ్,మే 28 ప్రభాతవార్త:** సురవరం ప్రతాప రెడ్డి జీవితం జర్నలిస్టులకు దిక్సూచి లాంటిదని టియుడబ్ల్యుజె (ఐజెయు) నాయకులు అన్నారు. బుధవారం సురవరం ప్రతాపరెడ్డి జయంతిని పురస్కరించుకొని టియుడబ్ల్యుజే (ఐజెయూ )వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.మాధవరావు ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐజేయూ నాయకులు కొంతం ప్రశాంత్, శ్రీనివాస్ రావు,డి.మాధవరావు బి.రాజు,బి.విజయ్‌లు మాట్లాడుతూ.. గోలకొండ పత్రికను స్థాపించి నిజాం నిరంకుశత్వాన్ని ప్రజలకు తెలియ జేసిన ధైర్యశాలి, కలం వీరుడు సురవరం అని కొనియాడారు. జాగీరుదారుల దోపిడీ, భూస్వాముల ఆధిపత్యం, హింస, దుర్భరదారిద్రం, క్రూరమయిన శిక్షలు,బానిసత్వం, నిర్బంధ వసూళ్లు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సంకెళ్ల ఇవీ,ఆనాటి నిజాం నిరంకుశ పాలనకు ఆనవాళ్లని అన్నారు. అటువంటి విపత్కర పరిస్థితుల్లో నిద్రాణమైన తెలుగుజాతిని తట్టి లేపేందుకు ఉవ్వెత్తున ఎగసిన కలం కెరటం సురవరం ప్రతాపరెడ్డి అని చెప్పారు. తన రచనా శక్తితో, కార్యదీక్షతో ప్రధానంగా తెలంగాణా ప్రజల్ని జాగృత పరిచి తెలుగు సంస్కృతిని ప్రపంచానికే చాటిన మహనీయుడని అన్నారు. నిస్వార్థ రాజకీయ నాయకుడిగా,పలు సంస్థల స్థాపకుడిగా, సారస్వత భగీరథుడిగా సురవరం చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. మహిళా విద్య కోసం, బీసీ హాస్టల్ల ఏర్పాటులో, దళిత చైతన్యానికి కీలకంగా వ్యవహరించారని అన్నారు. 1952లో వనపర్తి తొలి శాసన సభ్యునిగా ఎన్నికై వనపర్తి కీర్తిని నలు దిశలా వ్యాపింప జేశాడని అన్నారు. సురవరం జీవితాన్ని జర్నలిస్టులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో (టియుడబ్ల్యూ జే(ఐజేయు) పట్టణ ప్రధాన కార్యదర్శి మన్యం, నర్సింహా రాజు, అరుణ్ రాజ్,దాచ హరీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి బంగారు కమ్మల వితరణ

**మల్దకల్, మే 28,ప్రభాతవార్త:** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి మల్దకల్ గ్రామానికి చెందిన నరహరి శ్రీనివాసులు శెట్టి దంపతులు రెండు గ్రాముల బంగారు కమ్మలను ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు, అర్చకులకు అందజేశారు. అనంతరం వాటిని పూజలు నిర్వహించి అలంకరింపజేశారు. ఈ సందర్భంగా దాతకు స్వామి వారి శేష వస్త్రం, చరిత్ర పుస్తకం అందజేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల మంజూరి పత్రాలు అందజేత



ఇళ్ల మంజూరి పత్రాలు అందజేస్తున్న దృశ్యం

**బాలానగర్,మే 28 ప్రభాతవార్త:** బాలానగర్ మండలం తిరుమలగిరి గ్రామ పంచాయతీలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరి పత్రాలను ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాతృమూర్తి శశికళ రెడ్డి అందజేశారు. అనంతరం గ్రామంలోని దేగవత్ తాండలో లబ్ధిదారుడి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి నిరుపేదకి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మొదటి విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాని వారు నిరుత్సాహ పడవద్దని, ఇది నిరంతర ప్రక్రియ అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ధన్వాడలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు



జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**ధన్వాడ, మే 28 ప్రభాతవార్త :** విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు గారి 102 వ జయంతి సందర్భంగా నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ వెంకట్రామారెడ్డి ధన్వాడ మత్స్య కార్మిక సంఘ అధ్యక్షులు నీరేటి నరసింహ నాయుడు మాజీ డిసిఎంఎస్ డైరెక్టర్ కించే రఘువీర్ సీనియర్ నాయకులు సి.కొండారెడ్డి నారాయణపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీరేటి రామచంద్రయ్య, జత్రం రాములు గౌడ్, పటేల్ నరసింహులు, సంద బాల నరసింహులు, నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘ నాయకులు అధ్యక్షులు జయప్రకాష్ ప్రధాన కార్యదర్శి పి గోపికృష్ణ కెంచె నరసింహ పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

**పానగల్ డివిజన్ ఏడిఏ డి.చంద్రశేఖర్**

**చిన్నంబావి మే 28 ప్రభాతవార్త :** ప్రభుత్వ అనుమతి లేని నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పాన్‌గల్ ఏడిఏ డి. చంద్రశేఖర్ హెచ్చరించారు. బుధవారం చిన్నంబావి మండల కేంద్రంలో మండల అగ్రికల్చర్ అధికారి ఎం.మురళీధర్, ఎస్సై జగన్మోహన్‌లతో కలిసి విత్తన ఎరువులు విక్రయించే ప్రైవేట్ దుకాణాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో విత్తన, ఎరువుల దుకాణాలలో నకిలీ విత్తనాలను విక్రయిస్తే ప్రభుత్వ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు అనుమతి లేని ప్రైవేట్ విత్తన సంస్థలను నుండి విత్తనాలను కొనుగోలు చేస్తే అందుకు సంబంధించిన కొనుగోలు బిల్ పత్రాలను, వాటి లేబుల్‌లను పంట పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలని సూచించారు. పలు దుకాణాలలో స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సాయి రెడ్డి, దుకాణ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ అందజేత



ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ అందజేస్తున్న శశికళమ్మ

**జడ్చర్ల,మే 28 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ లోని 14 వ వార్డు సంజీవయ్య కాలనిలో ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుద్ రెడ్డి మాతృమూర్తి శశికళమ్మ పర్యటించారు. ఈసందర్భంగా ఖాళీ జాగా ఉండి ఇల్లులేని వారికి ఇందిరమ్మ ఇంటి ముహూర్తం ముగ్గు పోసి అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇంటి పట్టాలు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ పుష్పలత, హౌసింగ్ ఏఈ ఖాజామైనోద్దిన్,వార్డు ఆఫీస్ శివప్రసాద్, ఇందిరమ్మకమిటీ సభ్యులు మల్లిఖార్జున్ లక్ష్మమ్మ,పద్మ, సత్యనారాయణ, తైసిన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రఆనంద్, అనుప కృష్ణయ్య, ఖాజా అలిముద్దిన్, నసీర్, బాబా ఫక్రుద్దీన్, విజయ భాస్కర్‌రెడ్డి,అరవిందమ్మ, శాంతయ్య, నాగరాజు, గంట వెంకటేశ్వర్ రెడ్డి, భైరంపల్లి అనిత, జడ్చర్ల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు స్వప్న కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

